
# ధ్యేయం

సింగరాజు రామచంద్రమూర్తి



మా అన్నయ్యగారి అబ్బాయి ఉత్తరం రాశాడు- ఇల్లు మారాము, చూసిపోదువుగాని ఒకసారి రమ్మనమని.

నేను ఉంటున్నది బందరులోనే గాని ప్రాణం అంతా ఎప్పుడూ బెజవాడ మీదనే ఉంటుంది- కారణం పుట్టి పెరిగినది అక్కడ కావడం. అందువలన అక్కడికి వెళ్ళవలసి రావడం నాకు ఎప్పుడూ ఆనందమే.

పైగా నాకు మా వాళ్ళ కుటుంబం మీద 'గార్డియన్' హోదా కూడా ఉంది. ఎందువల్లనంటే చదువులకోసం పిల్లల్ని అక్కడ పెట్టి మా అన్నయ్య ఉద్యోగ రీత్యా వెళ్ళిపోయాడు.

ఆదివారం ఉదయమే బెజవాడలో దిగాను. రిక్షా చేయించుకొని నేను మెచ్చే హోటలు ముందు దిగాను. రోజూ ఊళ్ళో ఉండవలసిన వాళ్ళకి లేని తెగింపు మాలాంటి వారికి వస్తుంది. నిత్యం సైకిలుకిగాని, నడకకిగాని అలవాటుపడిన నేను ఇక్కడి కొస్తే రిక్షా దిగను, సిటీ బస్సు ఎక్కను !

టిఫిన్, కాఫీ అయినాక మళ్ళీ రిక్షా ఎక్కాను.

మా వాడు రాసిన ఉత్తరంలో ఇల్లు చేరుకోవలసిన విధానం కూడా రాశాడు. మెయిన్‌రోడ్డు నుంచి బొమ్మలు వేసి బాణాలతో దారి గుర్తుపెట్టాడు. వాడికి నేను చెప్పిన పాఠమే అది. చాలా మందిని చూసాను, ఇల్లు 'ఫలానాచోట' అని మొదలుపెట్టారంటే వినేవాడికి మతిపోవలిసిందే ! అసలే మన ఊళ్ళు, అందులోని పేటలు అన్నీ గందరగోళంగా ఉంటాయి - దాన్ని వీళ్ళు పెంచుతారన్నమాట !

కనుకనే మావాడి 'దారి చూపే బొమ్మ' నాకు బాగా నచ్చింది. మన ట్రయినింగ్ కదా మరి !

నేరుగా ఇంట్లోకి వెళ్ళిపోయి పడక్కుర్చీలో పడుకుని 'శైలా' అని కేకేశాను. అది మా అన్నయ్య చిన్న కూతురి పేరు.

లోపలనుంచి ఒకమ్మాయి వచ్చింది. ఇంటిపక్క వాళ్ళమ్మాయి అయుంటుంది. మనిషి చక్కగా ఉంది. కాని కొత్తగా వచ్చిన మా వాళ్ల 'స్టేటస్' దెబ్బ

తింటుందన్న భయంతో ఆ అమ్మాయి నుంచి చూపు మరల్చుకున్నాను.

"ఎవరు కావాలండీ ?" అనడిగింది ఆ అమ్మాయి తెల్లబోయి చూస్తూ.

ఢన్‌మని లేచాను.

అంతలోనే ఆ అమ్మాయే నవ్వి, "పక్కవాటా అండి - కొత్తగా వచ్చిన వాళ్లేనా ?" అంది.

గబగబ బయటికి వచ్చి మా వాళ్ళ భాగంలోకి వెళ్లాను. "అరె గోపీ" అంటూ అరిచాను పెద్దగా.

అక్కడే ముందు గదిలో కూర్చుని చదువుకుంటున్న వాడల్లా నన్ను చూసి "సారీ బాబాయి, వీధిదాకా బాణాలు బాగానే వేశాను. కాని ఇంట్లోకి వేయడంలో పొరపాటు జరిగింది," అన్నాడు.

"ఏడిశావు. అలాగ బాణాలు నేరుగా ఇంట్లోకి వచ్చేలా వేయనక్కర లేదూ?"

"అవును బాబాయి, గేటుదగ్గిరనుంచి బాణం వేయడంలో పొరపాటయింది."

లోపలినుంచి వచ్చిన మా వదినకి అర్థం అయినట్లు లేదు. బాణాలు వేయడం ఏమిటి ? గేటులోంచి బాణాలు వేయడం నేర్పుతున్నావా ఏమిటి ఖర్మ. ఎవరికేనా తగిలేను," అంది.

"అర్జునుడిలాంటి వాడు కొడుకు. అందుకు బాణాలు వేయడం నేర్పుతున్నాను. నువ్వలా నుంచుంటానంటే నీ తలమీద పండుపెట్టి కొట్టేయగలడు- రెడీనా ?" అన్నాను.

"మీ అన్నయ్యకి రెండో పెళ్ళి చేద్దామనేవిటి నీ కోరిక." నవ్విందావిడ.

"ముందు డ్యూటీమీద వచ్చాను కనుక ఇల్లు చూపించండి. మార్కు లేసి అన్నయ్యకి రిపోర్టు రాయాలి !"

నేను నిలబడి ఉన్న ముందు గదే నా మనస్సుకి తృప్తి నిచ్చింది. అందంగా అలమారాలు, కింద నున్నటి గచ్చు, విశాలమయిన కిటికీలు- చాలా బావుంది. మనస్సుకి నచ్చే విధంగా అన్నీ అమర్చి వాళ్ల మనస్సుకి నచ్చే అద్దె తీసుకోవడం మంచి పద్ధతి.

గిరగిరాఇల్లంతా తిరిగి ముందుగదిలో పడక్కుర్చీలో పడుకున్నాను. "ఫస్టుగా ఉంది. ఎవర్రా దీన్ని వెతికి పట్టుకున్నది?" అనడిగాను.

"అలా అడిగేందుకు ఇక్కడ ఎవరున్నారని ? కుమారుడికి పుస్తకాలు తప్ప మరో లోకం లేదుగదా ! నేనే వారినీ వీరినీ అడిగి— ఇప్పుడు ప్రాణం తెరిపిగా ఉందనుకో !" అందావిడ.

"వెనక అవుట్‌హౌస్‌లో ఎవరుంటున్నారు— ఇంటివారా ?"

"లేదు. ఇంటివాళ్ళు పక్కవాటలో- నువ్వెందాక చూసావే ఆ అమ్మాయి ఇంటి వాళ్ళమ్మాయి. వెనకనున్న రెండు గదుల్లో ఒకావిడ ఉంటుంది. మందుల కంపెనీలో ఉద్యోగం. వాళ్ళాయన విశాఖపట్నంలో కాబోలు. పని చేస్తున్నాడట. నెలకో రెండు నెలలకో వెళ్ళి వస్తుంటుంది," అంది.

"పాపం, నాలుగు రూపాయలు వెనకేసుకునేందుకు ఒక్కొక్కరు ఎన్నెన్ని ఇబ్బందులు పడుతున్నారో చూసావా ? ఆయనక్కడ, ఈవిడిక్కడ. ఈ తరం వాళ్ళు ఏమయినా వెనకేస్తేనే ముందు తరంవాళ్ళు సుఖపడేది ! రాబోయే వాళ్ల కసలు ఉద్యోగా అంటూ ఉంటాయో ఉండవో తెలియదు. ఇన్‌ఫ్రూట్ కొనుక్కోవాలన్నా రూపాయికి తక్కువుండదేమో" అని వాళ్ళ వంక చూసాను.

మా అన్నయ్య గారబ్బాయి చదువుకుంటున్నాడు. వదిన నేను తెచ్చిన సినిమా పుస్తకం చూస్తోంది. ఆవిడ భుజంమీదనుంచి చూస్తున్నారు మిగిలిన పిల్లలు.

లెక్చర్ వేస్తు ! లేచాను. "అలా ఒక రౌండు కొట్టివస్తాను. వంట వండొద్దు."

"నువ్వీ ఊరు వస్తే హోటళ్ళ వాళ్ళు కాళ్ళ కడ్డంపడతా రేమిటి ? వాళ్లేం అనుకోరుగాని భోజనంచేసి వెకుదువుగాని కూర్చో," అందావిడ సినిమాల్లోంచి తలెత్తకుండానే.

మన సిద్ధాంతాలు వీళ్ళకి చెప్పడం దండగ అనుకుని గబగబ బయటకి వచ్చేశాను.

బెజవాడ వెళ్లేముందుగానేస్నేహితులకి ఉత్తరాలు వ్రాయడం, వాళ్ళని ఒక సెంటర్లో కలుసుకోవడం అలవాటు నాకు. అటువంటిది ఈ సారి దొరకకపోతారా అనుకుని వచ్చేసాను. తీరా మా మామూలు సెంటరుకి వచ్చేసరికి ఎవ్వరూ కనబడకపోగా విచారిస్తే వూళ్లు వెళ్లారని కూడా తెలిసింది.

ఏం చేయడానికి తోచలేదు. అంతలో ఒక ఆలోచన వచ్చింది. గుంటూరులో మా వాడొకడు మందులషాపు పెట్టాడు. అది పెట్టిన కొద్ది రోజులకే బాగా నడుస్తోందన్న వార్త తెలిసింది. అయినవాడు బాగుపడుతుంటే ఆనందించేవాళ్ళలో మొదటి వాడిని నేను.

గంటన్నరకల్లా గుంటూరులో మావాడి షాపులో వాడితో మాట్లాడుతున్నాను. "చాలా బావుందన్నయ్యా మన షాపు" అన్నాడు వాడు ఫ్రిజ్‌లోంచి ఐస్‌వాటర్ బాటల్ నా ముందు పెడుతూ.

ఆ సెంటరు, అందులో వాడి షాపు- రెంటిలోనూ లక్ష్మి కళ ఉట్టిపడుతోంది. తీర్థప్రజలా వచ్చి పోతున్నారు జనం. "నువ్వు పని చూసుకోరా, సరదాగా వచ్చానంతే !" అంటూ పేపరు చదువుకుంటూ కూర్చున్నాను.

"అనాసిన్ ఒక ముప్పయి ఇవ్వండి" అన్న ఆడగొంతు వినబడి గభాలున తలెత్తాను.

అనాసిన్‌లు అన్ని కొనడం వింత

అనీ కాదు- ఆ గొంతు నాకు తెలిసిన గొంతు.

జానకి ! కరెక్ట్ — నా అంచనా తప్పదు...

మీరు జానకిగారు కదూ ?" అనడిగాను.

ఆవిడ నవ్వి "కాదండి, పొరబడి ఉంటారు !" అంది,

దెబ్బతిన్నాను. మా వాడేమను కుంటాడోనని సిగ్గుకూడా వేసింది. అయినా పరిశీలనగా చూసా నావిడని. ముప్పయి, ముప్పయి అయిదు మధ్యన వుంటుంది వయస్సు. తలలో అక్కడక్కడ తెల్ల వెంట్రుకలు అగపడు తున్నయి. కళ్ళజోడు వచ్చింది. ఇవన్ని తప్పించి చూస్తే జానకే ! నా మాట తప్పకూడదు మరి !

అనాసిన్ తీసుకు వెళ్ళిపోయిందావిడ.

నేను మా వాడిని "రెగ్యులర్‌గా వస్తుందా ఇక్కడికి ?" అనడిగాను.


"లేదు. ఈవిడ స్నేహితురాలో, బంధువో ఒకావిడ మన కష్టమర్. ఈవిడ అప్పుడప్పుడు వస్తుంది. ఇద్దరూ అనాదన్‌లు బాగా కొంటుంటారు," అని నవ్వి మరొకర్ని అటెండవుతున్నాడు.

"బస్సు ప్రయాణంలో ఒంగోలులో పరిచయం అయింది ఒకావిడ — చాలా కాలం క్రితంలే. ఆవిడిలా ఉంది !" అన్నాను.

మావాడు విననట్లుగా నవ్వి పనిలో పడిపోయాడు.

నాకు మాత్రం ఆవిడ అబద్ధం ఆడిందేమోనన్న అనుమానం పీడిస్తోంది... అచ్చం జానకిలానే ఉంది గాని నేను పొరపాటుపడి ఉండవచ్చు ననిపించింది- ఎప్పుడో చాలా కాలం క్రితం చూసాను. అందులోనూ మా పరిచయం రెండు రోజులు మాత్రమే !

అంతలో మనస్సు తిరగబడింది. 'పరిచయం' అంటే సామాన్యమయినదా!




నెల్లూరు కాంపుకి వెళ్ళి వస్తున్నాను. రాత్రి పదకొండు గంటలయింది. తిరుపతినుంచి తిరిగివస్తున్న బస్సులన్నీ హోటలుముందు ఆగుతున్నాయి, పోతున్నాయి. ఎందులోనూ సీటు దొరకడం లేదు.

పైన తుంపర పడుతోంది. నాకు చీకటి, వాన అంటే భయం. చివరికి బ్రతిమాలగా ఒక కండక్టర్ దయతలిచి "నిలబడగలరా గురూగారూ ?" అనడిగాడు. "కావాలంటే ఒంటికాలిమీద" అన్నాను విసిగిపోయిన నేను.

డ్రైవరు పక్క సింగిల్ సీటులో ఉన్న అమ్మాయి నా మాటకి తిరిగి చూసింది. అదే ఆమెని చూడటం మొదలు. తరువాత తెలిసింది ఆమె జానకి అని.

బస్సు కావలి దాటేసరికి వాన పెద్దదయింది, అదింకా ఇంకా పెద్దదయి ఒంగోలు దగ్గర పడుతుండగా భయంకరంగా మారింది. పెనుగాలికూడా మొదలయింది,

వాన ఉధృతానికి డ్రైవరుకి దారి కనబడటం లేదు. జోగుతున్న ప్రయాణికులకి మత్తు వదిలింది. కలవరం బయలుదేరింది.

సముద్రంలా కనబడుతున్న రోడ్డు మీదుగా బస్సు వచ్చి ఒంగోలులో ఆగింది. అక్కడ అప్పటికే అరడజను బస్సులు ఆగి ఉన్నయి ప్రయాణీకులతో కిటకిటలాడుతూ.

అవన్నీ కూడా నాకు సీటు ఇవ్వని బస్సులే కావడం నాకానందం కలిగించింది. అయితే అది ఎక్కువసేపు నిలవలేదు.

"బస్సు ఇంక వెళ్ళదండి, రోడ్డు పూర్తిగా కొట్టుకుపోయిందట," అన్నాడు డ్రైవరుగారు డిపోలోకి వెళ్ళి వచ్చి.

గుండె లాగిపోయాయి, నేనంటే వంటరివాడిని గాని పిల్లలతో ఉన్న అందరి ముఖాల్లో భయం, ఖంగారు కనబడుతోంది. "ఎంతసేపు ఇక్కడుండాలట ?" అనడిగారు ఎవరో.

"ఎంతసేపా ? ఎన్ని రోజులు అని అడగండి - ఊరు దాటితే మహా సముద్రంలా కనబడుతోందట అంతా," అన్నాడు మా రథసారధిగారు బిగ్గరగా నవ్వి.

అంతలో కండక్టరు వచ్చి "డిప్రెషనటండి బాబూ. రేపు ఈ ఊళ్ళో నేలమీదికి దిగుతుందట. అందువలన రేపు వర్షం పెరగడమేగాని తగ్గడం ఉండదు ?... ప్రసాదం లడ్డూ లెవరి దగ్గరన్నా ఉంటే తీయండి అవే ఆధారం" అన్నాడు.

ముందుసీటులోని అమ్మాయి వంక చూసాను ఏమీ పట్టనట్లు తలకి మఫ్లర్ కట్టుకుని పడుకుని ఉంది.

"ధైర్యస్తురాలు" అనుకున్నాను.

భళ్లున తెల్లవారింది. వాన, గాలి పెరుగుతున్నాయి.

కాఫీ త్రాగే ప్రాణులు ఆ వానలోనే పరుగెత్తి కాంటీన్ మనిషిని బ్రతిమాలి అక్కడ పోసిన కాఫీనీళ్ళు తెచ్చుకుని పంచుకుని తాగుతున్నారు.

మఫ్లరు ఒక్కసారి తీసి ఆ దృశ్యం చూసి మళ్ళీ ముఖాన కప్పుకుని పడుకుందా అమ్మాయి.

నాకు జాలేసింది ... ఆవిడ బాగ్ లోంచి సీసా ఒకటి బయటికి కనబడు తోంది– మంచినీళ్ళకోసం కాబోలు !

గబగబ వెళ్ళి ఆ సీసా తీసుకుని వర్షంలోకి దూకేను.

దాన్నిండా కాఫీ పోయించి ఒక ఖాళీ గ్లాసు తీసుకుని బస్సులోకి వచ్చాను.

నా వీరోచిత కార్యాన్ని అలా చూస్తోంది కిటికీలోంచి.

నేను నవ్వి "ముఖం కడుక్కోవా లన్న పట్టింపు ఉందా ?" అనడిగాను.

ఆవిడ కూడా నవ్వి "మీరంత కష్టపడి కాఫీ తెస్తే పళ్ళపొడి నేనివ్వ లేనూ" అంటూ బాగ్‌లోంచి పొట్లం ఒకటి తీసింది. "ఇది పవుడర్ లెండి– ప్రస్తుతానికి పని జరిగిపోతుంది," అని నాకు కాస్త ఇచ్చింది.

ఇద్దరం అలా బస్సులోంచే ముఖం కడిగేసాం. తరువాత సీసాలోంచి కాఫీ గ్లాసులో పోసి, "ఇప్పుడు నేను హోస్టుని. తాగండి," అనిచ్చాను.

"చాలా థాంక్సండి. దిగులుపడు తున్నాను 'ఎలాగ' అని. నాకు వాన, గాలి అంటే భయం," తను తాగేసి సీసాలోంచి కాఫీ నా కందించింది.

గ్లాసు కడగలేదని తెలుసు నాకు. పారబోస్తే సీసాలో ఇంక కాఫీ లేదన్న విషయమూ తెలుసు. క్రిందకి దిగి వెళ్ళినా కాఫీ అయిపోయుంటుదనీ తెలుసు. పైగా అప్పటికి నేను బ్రహ్మచారిని !

తాగేశాను.

"సారీ, మర్చిపోయాను," అంది. బస్సులోని వారంతా మావంక వింతగా చూస్తున్నారన్న విషయం గమనించి ఇంకా సిగ్గుపడింది.

"నెవర్ మైండ్. ఆపదలో ఎంతటి వారయినా బంధువులేట !" అని నవ్వాను.

ఆవిడ సీటు పక్కనే ఉన్న పెట్టెల మీద చతికిలబడి సిగరెట్టు వెలిగించాను. బయట కుండపోతగా ఉంది వర్షం.

కాంటీన్లో ఉప్మా తయారయిందట– అంతా పరుగు లెత్తుతున్నారు. ఇప్పుడు ఆకలికన్నా తరువాత ఆ మాత్రం దొరుకుతుందో దొరకదో అన్న దిగులు ఎక్కువవుతోంది జనంలో.

"ఉప్మా తీసుకురానా ?" అడిగాను.

"మీరూ తించేనే !" అంది. వర్షంలోకి దూకాను.

తరువాత భోజనాల వేళకి మాత్రం "ఈరోజు శివరాత్రి అనుకుని అలాగే కూర్చుండిపోండి. ఈ వానలో మళ్ళా ఏం వెతుకుతారు. అందులోను ఇక్కడ లేదు. ఊళ్లోకి పరుగెత్తాలి కూడా," అంది.

కాని నేను వినలేదు– "వర్షం మగాళ్ల నేం చేస్తుంది," అంటూ–

ఊళ్లో తెరిచి ఉంచిన ఏకైక హోటల్లో వాళ్ళు అడిగినంత ఇచ్చి నేను తిని ఆవిడకి ఒక పొట్లం కట్టించుకుని వచ్చాను.

"మీ కెలా థాంక్స్ చెప్పాలో తెలియడం లేదు," అంది.

చుట్టూ చెరువులా నీళ్ళు, మధ్య పడవలా బస్సు. ఆ బస్సులో నేను, ఆమె...! పక్కన డోర్ తీసినప్పుడల్లా తుపర పడి ఒళ్ళు జివ్వుమంటోంది... చలి చలిగా – వెచ్చగా – కబుర్లు చెప్పుకుంటూ గడిపేసాం రోజంతా.

అప్పుడు చెప్పింది తన పేరు జానకి అని.

ఆ మరుసటిరోజు గాలి బాగా తగ్గింది. వాన కూడా తగ్గుముఖం పట్టింది. ఆకాశంలోకి వెలుతురు కూడా వస్తోంది. మరో మార్పేమిటంటే అందరికీ ఆ ఊరి హైస్కూలులో ఉండే ఏర్పాటు చేయ బడింది... పెళ్ళివారి పార్టీలా అందరం అక్కడికి చేరుకున్నాం. ఒక్కొక్క బస్సువారికి ఒక్కొక్క క్లాస్‌రూమ్ ఇచ్చారు. అప్పటిదాకా కాళ్ళు జాపుకునే వీలు చిక్కనందువలన అక్కడి బల్లలు చూడగానే ఎక్కడి వాళ్ళక్కడ బల్లల మీద పడక లెట్టారు. కాసేపటికి నిద్రల్లోకి జారిపోతున్నారు కూడా !

"మీరు లేకపోతే నేనేమయిపోయే దాన్నో ?" అంది జానకి మెల్లగా. మేమిద్దరం మేడమీద కూర్చుని ఉన్నాం. ఆవిడకి ఎక్కువమంది మాట్లాడితే తల నొప్పి వస్తుందట. అందువలన గందర గోళానికి దూరంగా కూర్చుని ఉన్నాం.

''నేను కాకపోతే మరొకరు సాయం చేసేవాళ్ళు. ఇటువంటి స్థితిలో ఒకరి నొకరు ఆదుకోవడం సహజంగా వచ్చేస్తుంది," అన్నాను నవ్వుతూ.

''నాకూ మనస్సుకి బావుండ నక్కర లేదూ !" అంది.

నాకు అది కాంప్లిమెంటయింది !

ఆమె ముఖంలోకి చూసాను. తల వంచుకుని బల్లమీద గీతలు గీస్తోంది.

నేను పరాయి ఆడదాన్ని అంత దగ్గరగా చూసింది ఎన్నడూలేదు, పైగా ఇప్పుడు నేనామెకు సంరక్షకుడిని ! అది నాకెంతో ఆనందాన్ని, గర్వాన్ని కలిగించింది. అప్పుడే నాలో కొత్త భావాలు కలిగాయేమో కూడా !

"భోజనం చేసివద్దాం పదండి," అన్నాను లేచి నిలబడి.

"ఇంత వానలోనా ?" అని ఆమె అనలేదు. తనూ లేచింది. నెత్తిమీద టవల్స్ వేసుకుని పక్కనేఉన్న హోటల్‌కి వెళ్లాం. అది ఆ ఊరి మొత్తానికి పెద్ద హోటలు

"మీరు కూడా బస్సులోవాళ్లా సార్," అడిగాడు సర్వర్.

"ఎలా తెలుసు ?"

"అదేమిటిసార్. అమ్మగారు, మీరు-ప్రయాణం చేసినట్లు ఆ మాత్రం చెప్పలేమా సార్. మొత్తం రెండు వందలమంది ఉంటారా సార్ ?"

మూడు వందలకి పై మాట !"

"పాపం నిద్రలు కూడా బస్సులోనే గద సార్- అన్నట్లు సార్ రూం ఒకటి ఇప్పుడే ఖాళీ అయింది సార్. పొద్దున్నుంచీ జనం బోలెడుమంది వచ్చి అడిగిపోయారు సార్. ఆ సార్ అప్పుడు చేయకుండా ఇప్పుడే ఖాళీ చేసాడు సార్. కావాలా సార్ ?"

"ఇంత వానలో ఖాళీ చేసినదెవరోయ్ ?" అన్నాను- అతని ప్రశ్నకు సమాధానం నాకు ఎటూ తేలక !

"ఆయన మద్రాసు వెళ్ళాలి సార్ ? ఇప్పుడే ఎవరోవచ్చారు అటువైపునుంచి. రోడ్డు బాగానే ఉందిట... కావాలంటే చెప్పండి సార్."

జానకివంక చూసాను. తలవంచుకుని బల్లమీద గీతలు గీస్తోంది.

"సరే," అని నా పేరు చెప్పి వచ్చాను.

అతను మాకు సాయం చేశానన్న తృప్తితో గబగబ వెళ్ళిపోయాడు.

నేను జానకివంక చూసాను. ఆమె అలాగే కూర్చుని ఉంది. చేతివేళ్ళు నెర్వస్‌గా బల్లమీద కదులుతున్నాయి.

కిటికీల్లోంచి వాన కనబడుతోంది. ఆ వాన మీదుగా వచ్చే గాలి మధ్య




మధ్య ఒళ్లంతా చలితో నింపేస్తోంది. సుమారు రోజున్నర తరువాత కడుపు నిండా చేసిన భోజనం కూర్చున్న గదిలోని చల్లదనం- వెచ్చదనాన్ని కోరేట్లు చేస్తున్నాయి. నాలోని మార్పుని నేను గమనించగలుగుతున్నాను. అయితే ఆమె కూడా అదే స్థితిలో ఉన్నదని గ్రహించాను కూడా .

సర్వర్ వెంట నడిచాను. అప్పటికైనా ఆమె ఆగుతుందేమోనని ఆమెవంక చూసాను. నా కళ్ళలోకి చూసి మాట్లాడకుండా న న్ననుసరించింది.

గది తలుపు తీసి పక్కకి తప్పుకుని "బెడ్‌షీట్లు మార్చాను సార్ మరేమయినా కావాలంటే చెప్పండి సార్," అన్నాడు.

నేను చెప్పే స్థితిలో లేను. గదిలో మధ్యన నిలబడ్డాను. రెండు రోజుల చల్లదనం తరువాత గదిలోని వెచ్చదనం హాయిగా ఉంది. జానకివంక చూసాను. తలవంచుకుని నిలబడి ఉంది. బయటికి చూసాను. సర్వర్ లేడు. తలుపు ఓరగా వేసి వెళ్ళిపోయాడు.

వెళ్ళి తలుపు మెల్లగా వేస్తూ ఆమె వంక చూసాను.

ఆమె మాట్లాడలేదు.

తలుపు గడియపెట్టివచ్చి ఆమెకెదురుగా నిలబడ్డాను. మెల్లిగా తలెత్తింది. రెండు చేతులతో ఆమెను దగ్గరకు తీసుకున్నాను. ఆమె నాకు దగ్గరగా జరిగింది.

ఆ గది వెచ్చదనంతో నిండిపోయింది.

ఎప్పటికో స్పృహలోకి వచ్చాక "కాఫీ తెప్పించనా జానకీ!" అనడిగాను.

"ఊ" అంది.

కాఫీ టిఫిన్లయిన తరువాత మళ్ళీ ఎప్పటికో టైమ్ చూస్తే సాయంత్రం అయిదయింది. "మన జనాభాకి కనబడకపోతే బావుండదు," అన్నాను నవ్వుతూ.

"అవునవును" అంది లేచి కూర్చుని.

మేము తిరిగి వచ్చాక "గురూగారికి వానలో తిరుగుతుంటే వెన్నెలలో తిరిగి నట్లుంటోంది," అన్నా డొకాయన నవ్వుతూ.

"భోజనానికి కరువ్వాచిపోయామండి బాబూ, అందుకు తడిస్తే తడిసామని హోటలుకి వెళ్ళాము," అన్నాను.

అయితే వాళ్ళు అనుమానపడగలరని నాకు తెలుసు. అందులో నే నెరిగి వారెవరూ లేకపోవడం అదృష్టంగా అప్పుడు భావించాను.

"సర్లే కానీండి. మేము మీకోసమే ఎదురు చూస్తున్నాం. మరి కాసేపు అక్కడే 'టిఫిన్లు' చేస్తు కూర్చుని ఉంటే వెళ్ళిపోయేవాళ్ళం కూడా అన్నాడాయన

నా గుండె గుభేలుమంది. "బస్సులు బయలుదేరుతున్నాయా ?"

"బయలుదేరడ మేమిటి, కొన్ని అప్పుడే వెళ్ళిపోయాయి కూడా. మాచర్ల మీదుగా గుంటూరుకి రోడ్డు బావుందిట ! తెమలండి మరి" అన్నాడు.

నాకు ఎక్కడలేని దిగులు వచ్చింది. "జానకిగారూ,మీరు మీ బాగ్ సర్దుకోండి. నే నిప్పుడే వస్తాను," అని వెనక్కి హోటలుకి వెళ్లాను. రూమ్ వదిలేస్తుంటే ఆత్మీయుల్ని వదులుతున్నట్లయింది !

జయజయ ధ్వనులతో బస్సు బయలు దేరింది. అందరి ముఖాల్లో ఆనందం వెల్లివిరుస్తోంది, ఈ చెర ఇప్పటి కయినా వదిలినందుకు. మనసు బావుండలేనిది నాకే - కలలా గడిచిపోయింది !

జానకి తన మామూలు సీటులో కూర్చుంది.

బెడవాడ బస్టాండులో అందరూ దిగి పోయాక జానకి దగ్గరకి వెళ్ళి "అడ్రసు ఇవ్వవూ" అన్నాను మెల్లిగా.

అంత క్రితమే రాసి ఉంచి నట్లుంది. బాగ్‌లోంచి కాగితం తీసిచ్చింది

తీసుకుని ఆమెవంక చూసాను. తల అటు తిప్పుకుంది. ఆమె కళ్ళలో నీళ్ళు తిరగడం నాకు స్పష్టంగా కనిపించింది.

"సమాధానం తప్పకుండా రాయాలి."

తల ఊపింది.

గబగబ అంగలు వేసుకుంటూ వెళ్ళి బందరు బస్సెక్కాను. కిటికీలోంచి ఆమెకోసం చూసాను. కనబడలేదు.

ఉద్యోగంలో పడిపోతే అన్నీ మర్చిపోతా ననుకున్నాను. కాని అది భ్రాంతి అయింది. నామీద జానకి ముద్ర వేసింది. ఎందువలన నేనింతగా మర్చిపో లేకపోతున్నానని అంచనా వేసుకున్నా తేల్చుకోలేక పోయాను. ఎందువల్లనంటే అందం మాటకొస్తే ఆమె అందమయినది కాదనే చెప్పాలి, వయస్సు కూడా కొంచెం ఎక్కువేనని తెలుసు నాకు

అయినా ఆమె నన్ను విపరీతంగా ఆకర్షించింది. ఆమెలోని ప్రత్యేకతల్లో ఒకటి ఆమె మాట. ఒకసారి విన్న వారెవరూ ఆమె గొంతు మర్చిపోలేరు.

నేనామెను మర్చిపోలేనన్న విషయం గ్రహించటానికి కొంతకాలం పట్టింది. తరువాత ఒక నిర్ణయానికి వచ్చి ఆమె అడ్రసుకి ఉత్తరం రాశాను. పది రోజు లయినా సమాధానం రాకపోయేసరికి మళ్ళీ రాసాను.

రెండవ ఉత్తరం త్వరగా తిరిగి వచ్చింది - ఆ అడ్రసుగల మనిషి లేదని. మొదటిది ఆ తరువాత తిరిగి తిరిగి నన్ను చేరుకుంది - దానిమీద నా అడ్రసు రాయకపోవడంవలన ఆలస్యం అయ్యిందన్నమాట !

తెలివిగా తప్పు అడ్రసు ఇచ్చిందని గ్రహించాను. కోపం కూడా వచ్చింది. ఇటువంటి ఉత్తరాలు నా దగ్గరినుంచి వస్తాయని ఊహించే అలా చేసింది ! ఎందుకు చేసింది ? నేనంటే ఇష్టం లేకనా ?

కాలం అన్నది మర్చిపోయేలా చేస్తుంది. ఆఫీసు, అందులో పరీక్షలు, ప్రమోషన్లకోసం ఆశ, జీవితంలో పూర్తిగా పడిపోవడంతో నా ధ్యాస మారిపోయింది. మహా వేగంతో పరుగు లెట్టే ఈ మధ్య రోజులలో ఎక్కడయినా మంచి గొంతు వినబడితే మాత్రం జానకి గుర్తుకు వస్తుంటుంది. ఈ రోజూ అలానే జరిగింది...

"నీకోసం కాఫీ తెప్పించి చాలా సేపయిందయ్యా - ఏదో ఆలోచనల్లో ఉన్నావు. ఫ్లాస్కులో పోయించాను," అన్నాడు మావాడు నవ్వుతూ.

"అవునురా నిజంగానే ! నేను ఎరుగున్నవాళ్ళు 'ఆ మనిషిని నేను కాదండి,' అంటే నాకు మతిపోతుంది. భయం కూడా వేస్తుంది - పెద్దవాడి నయిపోతున్న నేమోనని !" అన్నాను,

కాఫీ తాగాక "అలా మా ఆఫీసు వాళ్ళని కలుసుకు వస్తారా," అని లేచాను.

"మధ్యాహ్నం టిఫిన్‌కు ఇక్కడికే రారా- రాత్రి భోజనంచేసి వెడుదువు గాని," అన్నాడు వాడు.

"ఎదురు చూడకు," అని బయటికి నడిచాను. పది గజాలు నడిచే సరికి ఒకతను నా దగ్గరకు వచ్చి "అమ్మగారు పిలుస్తున్నారండి," అన్నాడు.

నాకు ఆశ్చర్యం వేసింది. "అమ్మ గారెవరు ?" అనడిగాను.

"అమ్మగారండి !" అన్నాడు - ఆ మాత్రం తెలియదా అన్నట్టు. నేనేమీ మాట్లాడకపోవడంతో "మా షాపులో కూర్చున్నారు. మిమ్మల్ని పిలుచుకు రమ్మన్నారు" అన్నాడు.

అతనితో వెళ్ళాను.

ఇందాక టావిడ కూర్చుని ఉంది. "చూడండి, ఈ పవుడర్లలో ఏది మంచిది," అనడిగింది మామూలు ధోరణిలో.

నా కాశ్చర్యం వేసింది. ఇందాక 'నేను' కాదు అన్న మనిషి ఈవిడ.

ఇప్పుడు నన్ను పిలిచి... "ఈ కంపెనీ మంచిది. మంచివాసనకి ఇదిబావుంటుంది" అన్నాను నేను సాధారణంగానే.

షాపు వాడిచ్చిన పాకెట్లు చేతిలో పట్టుకుని "ఇక పదండి పోదాం," అంటూ బయటికి నడిచింది.

నేను అనుసరించాను. "ఇందాక మీరు అబద్ధం ఆడేరు కదూ !" అన్నాను మెల్లగా.

"అవును" అంది నవ్వుతూ.

"ఎందుకలా చేశారు ?"

"ఆ షాపుఆయన ముందు ఒప్పుకోవడానికి భయపడ్డాను," అంది. కాసేపాగి "తప్పు అడ్రసు ఇచ్చినందుకు అక్కడే కోప్పడతారేమోనని భయపడి" అని నవ్వింది.

"గొప్ప పని చేసావు — అయినా అదేం పని."

"ఏది - అబద్ధం ఆడడమా ?"

"లేదు. తప్పు అడ్రసు ఇవ్వడం."

ఏమీ మాట్లాడకుండా నడవటం మొదలెట్టింది జానకి.

"ఇలా ఎంత దూరం నడిపిస్తావు, రిక్షా పిలవనా ? అయినా ఎక్కడికి మనం వెళ్ళడం ? నువ్వుంటున్నది ఈ ఊళ్ళోనేనా ?"


నా మాటలు వినిపించుకోకుండా రిక్షా పిలిచి వాడికి గుర్తు చెప్పింది. తను రిక్షా ఎక్కి "రండి" అంది నన్ను.

"ఏమిటి — నడిచా ?" అంటూనే రిక్షా ఎక్కాను.

"నే నుంటున్నది ఈ ఊళ్ళో కాదు, మా ఫ్రెండ్ ఒకరు ఉంటున్నారిక్కడ. మధ్య మధ్య వచ్చి కొన్నాళ్ళిక్కడ ఉంటాను. నాలాంటి వారికి అటువంటివే ఆటవిడుపులు," అంది.

"ఎవరా ఫ్రండ్—ఏం చేస్తుంటారు?"

"మగబుద్ధి పోనిచ్చుకున్నారు కాదు.




'ఫ్రెండ్' ఆడమనిషి కాకూడదా ?" అంది నవ్వుతూ.

నా ప్రశ్నకి నాకూ నవ్వొచ్చింది.

ఒక సెంటర్లో రిక్షా ఆపుచేయించింది. ఇద్దరం దిగాము. "రండి" అంటూ అపుడే ఒకింటిలోకి దారితీసింది. తాళం తీసి లోపలికి వెళ్ళాము. అందంగా అమర్చబడిన గది నన్ను ఆహ్వానించింది. మంచి అభిరుచిగల మనిషి ఆ ఇంటిలో ఉంటున్న దనడానికి ఆ అలంకరణ ఉదాహరణ.

రెండవ గదిలోకి వెళ్ళింది. "కూర్చోండి" అని నాకు కుర్చీ చూపించి, తను మంచంమీద కూర్చుంది.

"ఏం చేస్తుందేమిటి మీ ఫ్రెండు ?" అనడిగాను. "అతి జాగ్రత్త! ఫ్రెండు మగాడెందుక్కాకూడదూ ?"

"మనిషివి మారావు."

పకపక నవ్వి "దుష్యంతుడిలా ఇన్నాళ్ళకి మీరు కనబడితే సరసం ఆడబుద్ధేయదూ ?" అంది

నేను అదిరాను. "దుష్యంతుడా ?" అన్నాను.

మళ్ళీ నవ్వింది. "ఉట్టి ఉదాహరణే లెండి."

"రెండు ఉత్తరాలు రాసాను, అవి అందక నాకే తిరిగి రావడం నా తప్పు కాదు."

అంతలో సీరియస్ అయిపోయి "సరదాకి అన్నాను — మిమ్మల్ని తప్పు పట్టటానికి కాదు... ఆ రోజు - మనం కలిసిన రోజు నే నెటువంటి స్థితిలోంచి వస్తున్నానో మీరూహించలేరు. అంతకు నెలరోజుల క్రితమే మా అన్నయ్య పోయాడు," అంది

"అయామ్ సారి ," అన్నాను.

"రిటైరయిన నాన్నగారిని, ఆయన సంతానంలో మిగిలిన ఆరుగుర్ని, అమ్మని ఇందర్ని పోషించాడు వాడు. అయినా మనిషి ఎప్పుడూ ధైర్యంగా ఉండేవాడు. నన్ను చదివించాడు.

"వాడి ఉద్దేశ్యం నేను ఉద్యోగంచేస్తే నాకు పెళ్ళి చేయడం తేలికని ! 'పెళ్ళి అన్నది జీవితంలో అవసరమయిన ఒక మార్పు జానీ, ఏ వయస్సు కా ముచ్చట ఉండి తీరాలి. మీ అందరికోసం నేను పెళ్ళి మానను. నిన్ను మాననీయను' అనేవాడు.

"అన్నట్లుగానే తను పెళ్ళిచేసుకున్నాడు. నాకు ఉద్యోగం వేయించాడు ఎవరి కాళ్ళో పట్టుకుని.

"నాకూ్కడా ఇంక పెళ్ళిచేసుకోగల

నన్న నమ్మకం ఏర్పడసాగింది. ఆ నమ్మకం వాడే కలిగించాడు నాకు.

"అప్పటిదాకా అంతా వాడనుకునట్లు గానే జరిగింది. 'మన కష్టాలు గట్టెక్క- బోతున్నాయి, ఈసారి పండక్కి- తప్పకుండా రావాలి నువ్వు,' అని రాసాడు.

"కొండంత ఆశతో వెళ్ళాను. కాని నేను చూసింది అన్నయ్యని కాదు– వాడి శవాన్ని. మా కందరికీ బట్టలు కొని రోడ్డు దాటుతుండగా లారీ గుద్దేసిందిట వాడిని !

ఒడ్డుకెక్క-బోతున్న నావ హఠాత్తుగా సుడిగుండంలోకి పడిపోయింది మళ్ళీ. మా సంసారంతో బాటు వదిన, పిల్లలు- వీళ్ళందరికోసం నే న్నిలబడాలి. నిల బడ్డాను కూడా !

ఒక నెలరోజులు వాళ్లతో ఉండి, వాళ్ళకి నే నున్నానన్న ధైర్యం కలిగించి, తిరిగి వస్తుంటే మీరు కనబడ్డారు," నవ్వింది.

కాసేపు మాట్లాడకుండా ఉండి పోయాం ఇద్దరమూను.

"నువ్వు పెళ్ళి మానడం దేనికి ?"

పేలవంగా నవ్వింది జానకి. "రాముడికి సీత ఏమవుతుంది అన్నా రుట వెనకటికి ... మా కుటుంబంకోసం చేసుకున్నా నానిర్ణయం. దానికిక తిరుగు లేదు...! రెండు ఊళ్ళు తిరిగి ఇప్పుడు విజయవాడ చేరుకున్నాను. ఒక్క- ఏడాది అక్క-డుంటే మా ఊరు ట్రాన్స్ఫర్ చేస్తామన్నారు ఆఫీసువాళ్లు. ఎదురు చూస్తున్నాను.

"ఈ జీవితంలో ఒక్క-టే తృప్తి- అన్నయ్య అడుగుజాడల్లో నడుస్తున్నా నన్నది. అయితే ఒక ఇబ్బంది నెదుర్కొ-ంటున్నాను ఈ వంటరి జీవితంలో," అని నవ్వింది.

నేనేమీ మాట్లాడలేదు. తనే అంది.

"వంటరిగా ఉన్న ఆడదానికి ఇల్లు దొరకదు. పొరపాటున ఎవరయినా ఇస్తే ఆ ఇంటి ఆడదానికి, మగాడికి– ఇద్దరికీ మనశ్శాంతి ఉండదు."

నాకూ నవ్వొచ్చింది. "ఎందుకు ?" అనడిగాను.

"భర్త ఎక్కడ జారిపోతాడోనని ఆడదాని భయం. 'వంటరిగా ఉన్న ఆడదాన్ని గురించి ప్రయత్నం చేయడం ఆలస్యం !' అని మగవారి నమ్మకం," అనినవ్వి అందుకే నేనొక అబద్ధం ఆడేస్తాను ముందుగానే ! 'నాకు పెళ్ళ యిందనీమా ఆయనకి ఉద్యోగం' అని దూరంగా ఉన్న ఊరుపేరు చెబుతాను. 'ఆయనకి ఒక్క-రోజు శలవివ్వరు ఖర్మ. అందుకు నేనే వెడుతుంటాను' అని శలవు పెట్టి వచ్చి మా రాజ్యం దగ్గర ఉంటాను," అంది.

"ఎందుకిన్ని బాధలు — అబద్ధం బయటపడక మానుతుందా ?"

"చెప్పాగా ఇళ్ళవాళ్ళ భయాలు ! అందువలన గత్యంతరంలేక ఈ పద్ధతి! అయినా కొద్దిరోజుల్లో ఎటూ ట్రాన్స్ఫర్ అయిపోతుంది. అబద్ధం బయటపడు తుందని భయం దేనికి ? బయటపడినా నేనేం చెడుపని చేయడంలేదుగా- వాళ్ళ మనశ్శాంతికోసమే ! ఎక్క-డో ఉన్న నా 'మొగుడు' ఆవిడ మొగుడికి అడ్డం అన్నమాట !"

ఇద్దరం నవ్వేశాము.

"మా రాజీక్కూ-డా నాలాంటి సమస్యలే ఉన్నాయి. అయితే భయస్తు రాలు రేపో మాపో పెళ్ళి చేసుకో బోతోంది...ఆగండి టిఫిన్ ఏమయినా తెప్పిస్తాను. ఆకలేయడం లేదూ ?" అని బయటికి వెళ్ళి ఎవరో పనిపిల్లని పిలుచుకొచ్చింది. "మీకేం కావాలి చెప్పండి ?"

చెప్పాను.

"మా రాజీ ఆలస్యంగా వస్తానని చెప్పి వెళ్ళింది. అది వచ్చేదాకా ఎలాగ అని భయపడ్డాను. దైవికంగా మీరగ పడ్డారు," అని నవ్వింది.

మాట్లాడటం ఆమె ప్రత్యేకత. అంత అందమయిన గొంతామెది. నవ్వితే సంగీతం.

"కాస్సేపు కార్డ్స్ ఆడదామా ?" అంది.

నేనామెనే చూస్తున్నాను. మనిషి ఇది వరకు మీద రంగు వచ్చింది. ఒళ్ళు కూడా వచ్చినా వెనకటి నాజూకు తగ్గ లేదు. అక్క-డక్క-డ రెండు మూడు వెంట్రుకలు తెల్లబడినా ఆమెపట్ల ఆకర్షణని అవి పెంచాయేగాని తగ్గించడం లేదు. కళ్ళజోడు హుందాతనా న్నిచ్చింది.

"చూడటం మాని ఆడండి. అసలు చీట్లాట వచ్చునా ? లేకపోతే కారమ్స్ ఆడదామా-టిఫిన్‌వచ్చేదాకాకాలక్షేపం!" అంది నవ్వుతూ.

కార్డ్స్ వేస్తుంటే, తీస్తుంటే ఆమె వేళ్ళని చూసాను — చాలా అందంగా ఉన్నా యనిపించింది... !

"ప్రతి ఆటలోనూ మీరే ఓడిపోతే ఇంక ఆడటం ఎందుకూ దండగ ! ఆ ధర్మరాజుకూడా మీలాంటివాడే అయ్యుం టాడు," అని పకపక నవ్వింది.

నేనూ నవ్వేసాను. "ఆయనక్కూ-డా ఆడినంతసేపూ ద్రౌపది గుర్తుకు వచ్చి ఉంటుంది," అన్నాను.

గభాలున లేచి "టిఫిన్ తేవడం ఇంత ఆలస్యం అయిందేమిటబ్బా," అంటూ బయటికి వెళ్ళింది జానకి. తిరిగి వస్తూ మరో అమ్మాయిని వెంటబెట్టుకుని వచ్చింది. "ఇదే మా రాజీ– రాజ్యలక్ష్మి. ఎవరి రాజ్యానికో ఇంకా తేలలేదు రాజుల సెలక్షన్ అవుతోంది. "పేరులో 'లక్ష్మి' ఉంటే కాదు, వెంట తేవాలి,"

అనీ అంటున్నారు రాజులంతా... వీరు నా ఫ్రెండు ఒంగోలులోని ఆపదలో, దగ్గరయినవారు. పేరు ..." అని కాసేపాగి "దుష్యంతుడు"గారు అని నవ్వింది.

రాజ్యలక్ష్మి కూడా నవ్వి "ఓహ్, నమస్కారమండి" అంది.

నేను సిగ్గుపడవలసివచ్చింది.

"కాళ్లు కడుక్కుందువు గాని పద. నేను స్నానంచేసి వస్తానండి," అంటూ ఆ అమ్మాయిని తీసుకుని లోపలికి వెళ్ళిపోయింది.

ఒక అరగంట పుస్తకాలు చదువుకుని కాలక్షేపం చేశాను.

అంతలో జానకి వచ్చింది. "మా రాజి సినిమాకి వెడదాం అంటూంది. మా అతిథులు కదా మీరు."

ఆడది తలుచుకుంటే చాలా అందంగా తయారు కాగలదు అనిపించింది నాకు జానకిని చూస్తుంటే ! నా మొదటి అభిప్రాయం మార్చుకోవలసి వచ్చింది కూడా– "జానకిలో ప్రత్యేకత ఆమె గొంతు మాత్రమే కాదు, ఆమె అందమయినది కూడా," అన్నది ఇప్పటి నా నిర్ణయం.

"పిక్చర్‌కి వెడదామా అనడిగాను," అంది తలలో జాజులదండ పెట్టుకుంటూ.

ఆమె చీర కట్టుకోవడం చాలా బావుంది. ఆమె జాజులు పెట్టుకోవడం కూడా చాలా అందంగా ఉంది నాకు.

"ఓ యస్," అంటూ లేచాను.

ఫక్కున నవ్వింది. "ఏడిసినట్టుంది– ఇంకా అరగంట టైముంది. ఈ లోపల మొహం కడుక్కుని రండి. టిఫిన్, కాఫీ రెడీగా ఉన్నాయి."

సినిమాకు వెళ్ళేందుకు రిక్షాలు పిలుస్తుందనుకున్నాను. కాని "నడిచి వెడదాం– భయమా?" అంది నవ్వుతూ.

"భయం దేనికి ?" అన్నాను. నిజానికి పరాయి ఆడదానితో అలా రోడ్లమీద ఈ ఊళ్ళో నడిచేందుకు భయపడేవాడినే ! అయితే ఇప్పటి నా స్థితి వేరు – మా బంధువుల ఇంటికి వెడదామన్నా రెడీయే !

గాలిలో తేలుతున్నట్లుగా ఉంది

డబ్బు నా చేతికిచ్చి "టికెట్లు తీసుకు రండి" అంది హాలు దగ్గర.

"నా దగ్గర లేదా ?" అన్నాను.


"లేదనా—మీరు మా అతిథి ! మేమే తేవచ్చునుగాని అది రోజూ జరిగే పనే ! మగాడు కొని తేవడంలోని థ్రిల్ ఎలా ఉంటుందో నని."

వాళ్ళిద్దరూ నవ్వారు.

సినిమాలో నా పక్కన జానకి కూర్చుంది. ఆమె పక్కన రాజ్యలక్ష్మి.

సినిమా నాకేమీ అర్థం కాలేదనే చెప్పాలి. నా మీదికి వంగి సినిమా గురించి మాట్లాడుతోంది మధ్యమధ్య. ఆమె మీదుగా– ఆమె కదిలినప్పుడల్లా చక్కటి సెంటువాసన వీస్తోంది. జాజిపూలు గుభాళిస్తున్నాయి. ఆమె ఒళ్లు తగులుతోంది నాకు మెత్తగా.

ఇంటర్వెల్‌లో డ్రింక్స్ తెప్పించాను. హాలులో చాలామంది దృష్టి మా మీదనే ఉందని చెప్పాలి. 'మా' మీద అనేదానికన్న నా పక్కన ఉన్న వాళ్ళ మీదనే ఉందనడం సబబు. వాళ్ళ పక్కన కూర్చోకలిగినందుకు నా వంక ఈర్ష్యగా చూస్తున్నారేమో కూడా ననిపించింది.




సినిమా అయినాక కబుర్లు చెప్పుకుంటూ బయలుదేరాం. దారిలో హోటల్లో భోజనం చేద్దామంది జానకి. ఆకలి లేకపోయినా సరేనన్నాను. ఏ.సి. హోటల్లో భోజనం చేసాం. హోటలు వాడిచ్చిన మూడు కిళ్ళీలు నేనే వేసుకొని సిగరెట్టు వెలిగించాను. వెన్నెల రాత్రి కావటాన చిరు చలి అప్పుడప్పుడే ప్రారంభం అయే రోజులు కావటాన మనసు మహోత్సాహంలో ఉన్నది !

ముందు గదిలో వేశారు నా పక్క ! కొంచెంగా ఆశ్చర్యం వేసింది.

"మీరు బట్టలు మార్చుకునేందుకు లుంగీలు లేవు ఇంట్లో !" అని నవ్వి, "కావాలంటే ఒక చీర ఇస్తాను. ఇప్పుడదేగా ఫాషన్" అంది జానకి.

నేనూ నవ్వాను.

"మీకు కావాలంటే అదుగో కూజా. వీధి తలుపు గడియ వేసుకుని పడుకోండి," అని లోపలికి వెళ్ళిపోయింది.

ఆమె ప్రవర్తన నా కర్థంకాలేదు.

ఒక గంట ఎదురుచూస్తూ పడుకున్నాను. మధ్యనున్న డోర్‌కర్టెన్స్‌లో కనీసం కదలికయినా లేదు..! వారిద్దరూ నిద్రకూడా పోయారేమోనని అనుమానం వచ్చింది. అయితే నాకు నిద్ర పోయేందుకు మనసొప్పలేదు. మెల్లగా లేచి వాళ్ళ గదివైపు వెళ్ళాను.

గడితలుపులు వేసి ఉన్నాయి. లోపల గడియపెట్టి కూడా ఉన్నాయి.

ఒళ్ళు మండిపోయింది. ఈ మాత్రం దానికి సాయంత్రంనుంచీ అటువంటి ప్రవర్తన దేనికి?...గొడవ చేసెయ్యా లన్నంత కోపం వచ్చింది.

లైటు వేశాను. నా మంచం పక్కన ఉన్న టీపాయ్ మీద ఒక కాగితం మడతపెట్టి ఉంది. దాని మీద ఒక ఆపిల్ బరువు కూడా పెట్టిఉంది! ఇందాకటి నా మానసిక స్థితి ఇవన్నీ పట్టించుకునే స్థితిలో ఉండి ఉండదు.

తీసి చూశాను. అందులో —

"మీకు వింతగా ఉంటుందని తెలుసు. తలుపు గడియవేసి ఉంచే కోపం కూడా వచ్చి వుంటుంది.

"జీవితంలో పెళ్ళిచేసుకునే అదృష్టం ఎప్పటికో తెలియదు కనుచూపు మేరలో మాత్రం లేదు. ఆ అదృష్టం వచ్చేనాటికి నా వయస్సు మీరిపోవచ్చును కూడా. అందుకే అసలు చేసుకో కూడదని ఎప్పుడో నిర్ణయించుకున్నాను.

"అందమయిన రోజు ఒక్కటిచాలు— జీవితమంతా దాన్ని భద్రంగా గుండెల్లో దాచుకోగలను. అది మళ్ళీ కోరితే అందులోని పవిత్రత పోతుంది.

"ఈనాటి నా ప్రవర్తనకి కారణం భర్తలతో సినిమాకి వెళ్ళడం అన్న అనుభవం కూడా మీ ద్వారానే పొందా లని! పొందాను. చాలా కళ్ళు మన మీదనే ఉన్నాయని గ్రహించాను.

కృతజ్ఞురాలిని
మీ
జానకి"

కాసేపు అలా పడుకున్నాను. ఎంత సేపో నాకే తెలియదు ఇక నా కక్కడ ఉండబుద్ధి కాలేదు.

జానకి ఉన్నతురాలై నన్ను నేలకి దించేసింది.

బట్టలు వేసుకుని తల దువ్వుకుని టైము చూసుకున్నాను. రాత్రి రెండు గంటలయింది. చప్పుడు చేయకుండా బయటికి నడిచాను. చిన్నతనం నుంచీ కూడా నాకు బయటనించి తలుపు లాగి గడియవేయడం బాగా అలవాటు. అదేవిధంగా వేసేసి రోడ్డెక్కాను.

చల్లగాలి పెరిగింది.

బెజవాడ చేరేసరికి తెల్లవారింది. స్టాండ్‌లోనే అన్నీ పూర్తి చేసుకుని మా వాళ్ళింటికి చేరుకున్నాను.

"రాత్రి ఏమయ్యావు?" అనడిగారు వాళ్ళు నన్ను చూడగానే.

"ఒక ఫ్రెండుంటే...ముందు స్నానం చేయాలి" అంటూనే బాత్‌రూంలోకి వెళ్ళాను.

స్నానంచేసి వస్తున్న నాతో మా అన్నయ్యగారి అమ్మాయి అంది, "ఈ అవుట్‌హవుస్‌లో ఉన్నావిడ ఈ పాట చాలా బాగా పాడుతుంది" అని.

"ఏ పాట?".

"నువ్వప్పుడు పాడుకోవడంలేదూ- అది. ఏకవీరలో పాట".

నాకు ఛళ్ళుమన్నట్లయింది. నిన్న జానకి ఆ పాటని కూనిరాగం తీస్తుంటే నాకది ఈ రోజు గుర్తుకువచ్చి పాడు కుంటున్నట్లున్నాను.

"ఆవిడ గొంతు బావుంటుందా?" అడిగాను.

"చాలా బావుంటుంది. వినాలనిపిస్తుంది. నవ్వితే చాలా అందంగా ఉంటుంది" అంది.

ఆ అవుట్‌హవుస్‌కేసి చూశాను తాళం పెట్టిఉంది. పై కిటికీ రెక్కలు తెరిచి ఉన్నాయి.

"ఊరు వెళ్ళిందిలే. ఈ రోజో రేపో రావాలనుకుంటా" అంటూ లోపలికి వెళ్ళిపోయిందది.

లోపలికి వెళ్ళి బ్యాటరీ లైటు తీసుకుని మళ్ళీ అవుట్‌హవుస్ దగ్గరకు వెళ్ళాను. ఎవ్వరూ చూడటంలేదని నిర్ధారణ అయినాక కిటికీలోంచి లోపలికి చూశాను.

ఎదురుగా గోడకి ఫొటో ఒకటి తగిలించిఉంది. అటువంటిదే రాజ్యలక్ష్మి ఇంట్లో కూడా చూశాను. అది జానకి, రాజ్యలక్ష్మి కలిసి తీయించుకున్నది.

కనుక ఆ ఇంటిలో ఉన్నది జానకి!..

నేను బయలుదేరుతుంటే "భోజనం చేసి వెళుదువుగాని, అన్నం వండేశాను" అంది వదిన.

"లేదు. అర్జంటు పనిఉంది" అన్నాను.

జానకి వచ్చేసరికి నేనక్కడ ఉంటే ఎలా ఉంటుందో!

ఆవిడ నవ్వుతూ "అయితే ఇల్లు నచ్చినట్లేనా లక్ష్మణుల వారికి?" అంది.

"ఏం ఇల్లండీ బాబూ, సాధ్యమయి నంతత్వరలో ఖాళీచేసేయడం మంచిది" అని రోడ్డున పడ్డాను.

నా వెనక వాళ్ళు తెల్లబోయి ఉంటారు.

